క్లుప్తంగా

సీఎంకు క్రిస్మస్ శుభాకాంక్షలు



అలంపూర్ : రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా, ఎంపీ మల్లు రవి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ హైదరబాద్‌లో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బలిజపల్లి గ్రామాన్ని విలీనం చేయొద్దు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బలిజపల్లి గ్రామాన్ని జంగమాయపల్లి గ్రామంలో విలీనం చేసేందుకు అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఎత్తివేయాలని, లేనియెడల నిరసన దీక్ష చేపడతామని బలిజపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జయంతి అన్నారు. 'వీలినం వద్దు గ్రామ పంచాయతీ కావాలి' అంటూ గ్రామస్తులు, మహిళలు చేస్తున్న రిలే నిరాహారదీక్ష బుధవారం మూడో రోజుకు చేరింది. గ్రామస్తులకు మద్దతుగా మాజీ సర్పంచ్ జయంతి దీక్షలో పాల్గొని మాట్లాడారు. విలీన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని రెండు గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. కొన్నేళ్లుగా బలిజపల్లి గ్రామం ఒక గుర్తింపుగా ఉందని, నూతన గ్రామపంచాయతీ ఏర్పడిన తర్వాతనే గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. జంగమయ్యపల్లి గ్రామంలో విలీనం చేస్తే సహించేది లేదని, ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వం విలీనం ఆలోచన ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజ. సత్య శిలారెడ్డి. శశివర్ధన్‌రెడ్డి. సంజీవ రెడ్డి. నాగరాజు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో నిరసన దీక్షలో పాల్గొన్నారు.

విరాళం అందజేత

ఎర్రవల్లి: మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి నూతన జెరూసలెం చర్చిలో బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి అభివృద్ధి కోసం రూ.30,000 నగదు మత పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రేమదాస్, దుబ్బన్న, వెంకట్రాముడు, శ్రీరాముడు, దేవన్న, నర్సింములు, తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కోసం పోరాడాలి



గట్టు : గెలుపు కోసం చివరి దాకా పోరాడాలని ఎస్ఐ మల్లేష్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం మాచర్ల గ్రామంలో ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎస్ఐ మల్లేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మల్లేష్ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటుగా శారీరక ధారుఢ్యం కలుగుతుందన్నారు. ఇలాంటి పోటీలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రతిభ కల్గిన గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి వస్తారని ఆశించారు. కార్యక్రమంలో వై హనుమంతు, ఎంజీ నర్సింహులు, శివరాజ్, బుజ్జీ, సుందర్‌రాజ్, హుసేని, ఆనంద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీదేవమ్మ, వారాల రాములు, ఈడిగ అరంజ్యోతి, కావలి శివ, తెలుగు మహేశ్వరి, కావలి అక్కమ్మ, హరిజన్ సుందరయ్య, హరిజన్ శాంతయ్య, దేవమ్మ, లోకేష్, హరిజన్ బీసమ్మలకు సీఎం ఆర్ఎఫ్ నుంచి రూ.2 లక్షల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. చెక్కులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లి, మంజూరుకు కృషి చేసిన మండల నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవర్ధన్‌సాగర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాచర్లలో క్రిస్మస్ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు



గద్వాల అంధుల పాఠశాలలో ..



ఎర్రవల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



క్యాతూర్ చర్చి దగ్గర పర్యవేక్షిస్తున్న ఏఎస్ఐ బాషా

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సేవా గుణమే క్రిస్మస్ లక్ష్యమని పాస్టర్లు బోధనలు వినిపించారు. గత అర్ధరాత్రి నుంచి ప్రార్థన గీతాలు ఆలపిస్తూ భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ పండుగ జరుపుకున్నారు. క్రీస్తు బోధనలు వినిపిస్తూ గీతాలు ఆలపించారు. క్రిస్మస్ సందర్భంగా పలు చోట్ల అన్నదానాలు, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంచిపెట్టారు. నియోజకవర్గంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పాల్గొన్నారు. క్రిస్మస్ అంతరార్థాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరసోదరీమణులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పలు చోట్లు బైబిల్ క్విజ్ పోటీలు జరిపారు. వేడుకల్లో చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగ ఐక్యవేదిక జిల్లా నాయకులు మోహన్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు రామకృష్ణారెడ్డి, మోహన్‌గౌడు, రాజప్ప,అలీ, సురేష్, రామకృష్ణనాయుడు, పుల్లారెడ్డి, రమేష్, నర్సింహులు, బీఆర్ఎస్ నేత హనుమంతునాయుడు, నూర్‌పాష, తిరుమలేష్, తిమ్మప్పగౌడ్, బాసు గోపాల్, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి



ఎర్రవల్లిలో ప్రత్యేక ప్రార్థనలో మహిళలు



గద్వాలలో క్రిస్మస్ వేడుకల్లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత



అలంపూర్‌లో సంత మార్కెట్ చర్చిలో..



కేటీదొడ్డిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



అయిజ పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ



ధరూరులో ప్రార్థనలు చేయిస్తున్న క్రైస్తవులు

వాజ్‌పేయికి ఘన నివాళి



గద్వాలలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



అయిజలో రక్తదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హాజరై రక్తదానం శిబిరం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత తరలివచ్చి 150 యూనిట్ల రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేకే రెడ్డి, ఈశ్వర్, భీమ్‌సేనరావు, గోపాలకృష్ణ, భగత్ రెడ్డి, ప్రదీప్ కుమార్, వెంకటేష్, లక్ష్మణ్ గౌడ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, వివిధ గ్రామాల యువకులు పాల్గొన్నారు.

ఆదర్శనేత వాజ్‌పేయి..

గద్వాలటౌన్ : భారత మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప ఆదర్శ నేత అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రామంజనేయులు కొనియాడారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ఆవరణ, ఆసుపత్రిలో శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, కౌన్సిలర్ జయశ్రీ, శివారెడ్డి, నర్సింహా, దేవదాసు, అనిల్, శ్యామ్, మోహన్, డబులేటి నర్సింహా, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

అలంపూర్ : పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గొంగళ్ల ఈశ్వర్, మండల అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి, నాయకులు లక్ష్మణ్, రాము, మద్దిలేటి, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

టోర్నీ విజేతగా ఆర్‌జీడీఎస్ జట్టు

ధరూరు: క్రిస్మస్ పండుగ సందర్భంగా డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆర్‌జీడీఎస్ జట్టు విన్నర్, రైజింగ్ స్టార్ జట్టు రన్నరప్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని గాండ్ల వీరప్ప స్టేడియంలో పోటీలు నిర్వహించారు. విన్నర్, రన్నర్ జట్లకు నగదు బహుమతిగా రూ, 30 వేలు, 20 వేలు దాతలు, మండల కాంగ్రెస్ నాయకులు డీఆర్ విజయ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవికుమార్, రాజు, నర్సింహ, పర్ష, మార్క్, డీజే రాజు, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.



నగదు, షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు

ఇటిక్యాల : మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇటీవల పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షాను తన పదవికి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ నాయకులు సందీప్, ఏసేపు, నవీన్, రాజశేఖర్, కుమార్, రాజు, భాను తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

ఉండవెల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు ర్యాలీ చేశారు. ర్యాలీ అనంతరం కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నాగేష్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి, మధు, నాగరాజు, బాలస్వామి, శ్రీరాములు, ప్రవీణ్, అభి, చిరు తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలోని నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాజీ ఎంపీని పరామర్శించిన నాయకులు



జగన్నాథం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ



మాజీ ఎంపీని పరామర్శిస్తున్న నాయకులు

అలంపూర్ : మాజీ ఎంపీ మందా జగన్నాథంను పలువురు నేతలు పరామర్శించారు. హైదరబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మందా జగన్నాథం అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు బుధవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రాములు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరితలు వేర్వేరుగా కలిశారు. కుటుంబ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కల్పించండి సారూ

- రోడ్డు సౌకర్యం ఉన్నా తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నేతువానిపల్లి నుంచి సద్దలోనిపల్లి స్టేజీ వరకు కాలినడకన వస్తున్న మహిళలు

మల్దకల్ : బీటీ రోడ్లు బాగానే ఉన్నాయి.. బస్‌లు మాత్రం తిరగడం లేదు. గతంలో గ్రామీణ బస్సులను నడిపించిన ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు బస్‌లు ఎక్కడం లేదన్న సాకుతో వివిధ గ్రామాలకు నడిపిస్తున్న బస్‌ను కూడా అర్ధాంతరంగా నిలిపేశారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్డు సౌకర్యం కల్పించినప్పటికి బస్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కోటి రూపాయలతో నిర్మాణం..

మండలంలోని సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి వరకు 9 ఏళ్ల క్రితం కోటి రూపాయల వ్యయంతో బీటీ రోడ్డును ఏర్పాటు చేశారు. కుర్తిరావుల చెర్వు నుంచి అయిజ రోడ్డు వరకు, తాటికుంట నుంచి స్టేజీ వరకు , నాగర్‌దొడ్డి నుంచి అయిజ స్టేజీ వరకు, దాసరపల్లి నుంచి బిజ్వారం వరకు, మల్దకల్ నుంచి ఎల్కూరు మీదుగా విఠలాపురం నుంచి అయిజ వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికి బస్ సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రతినిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం..

ఆర్టీసీ బస్ సర్వీసులు సరిగా లేకపోవడంతో అదునుగా భావించిన ప్రైవేటు వాహన దారులు, అధిక ఛార్జీలు వసూలు చేయడంతో పాటు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు ప్రతి రోజు 3కి.మీల మేర కాలినడకన వెళ్లివస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు గత్యంతరం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



బస్ సౌకర్యం లేని కుర్తిరావల్‌చెర్వు

అధికారులు పట్టించుకోవడం లేదు..



నాగర్‌దొడ్డికి బస్ సౌకర్యం కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రోడ్డు ఉన్నా బస్‌లు తిరగకపోవడంతో ప్రతినిత్యం ఇబ్బందులు పడుతున్నాం. గ్రామం నుంచి సద్దలోనిపల్లి స్టేజీ వరకు కాలినడకన వెళ్లి బస్సులు ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

రాముడు, నాగర్‌దొడ్డి

కాలినడక తప్పడం లేదు..



మల్దకల్ నుంచి కుర్తిరావులచెర్వు మీదుగా అయిజ వరకు బస్ సౌకర్యం కల్పించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వివిధ పనుల నిమిత్తం అయిజ- గద్వాలకు వెళ్లేందుకు 4కి.మీల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బుడ్డన్న, కుర్తిరావల్ చెర్వు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

డిపో పరిధిలోని ఆయా గ్రామాల్లో బస్‌లు తిరగడం లేదని సమస్య మా దృష్టికి వచ్చింది. రోడ్డు సౌకర్యం ఉన్న బస్‌లు తిరగని గ్రామాలు పరిశీలించి బస్‌లు యథావిధిగా నడిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వెంటనే ఆయా రూట్లకు బస్ సర్వీసులను కొనసాగించేందుకు చర్యలు చేపడుతున్నాం. విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సర్వీసులు నడుపుతాం.

మురళీధర్ , డిపో మేనేజర్, గద్వాల

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

మానవపాడు: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ భాస్కర్ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని చిన్నపోతులపాడు, బోరవెల్లి, మానవపాడు గ్రామాల్లో చేస్తున్న సర్వేను పరిశీలించారు. కార్యదర్శులు సర్వేలో పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని కర్రెమ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా రెండో హోమం నిర్వహించారు. దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహన్ని పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు రామకృష్ణ శర్మ, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

దాడి సంఘటనపై కేసు నమోదు

పాన్‌గల్: దూషించి దాడి చేసిన సంఘటనపై ఒకరిపై కేసు నమోదైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన పెబ్బేటి కుర్మన్న ఇంటి ముందు ఈనెల 18న గుర్తుతెలియని వ్యక్తులు కల్లు కవరును పెట్టి వెళ్లారు. ఈ విషయంపై 22న కుటుంబ సభ్యులు ఇంటి ముందు చర్చించుకుంటుండగా, ఇదే గ్రామానికి చెందిన సూర గోపాల్ తనను తిడుతున్నారని వారిపై కట్టెతో దాడి చేశాడు. దీంతో పెబ్బేటి కుర్మన్న ఎడమ కాళ్లు, కుడి చేయి భుజంపై గాయాలయ్యాయి. దీంతో బుధవారం పెబ్బేటి కుర్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూరగోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ



పాన్‌గల్: మండల కేంద్రంలో ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు నిర్వహించిన ఉపాధి పనుల్లో రూ.72.87 లక్షలకు సంబంధించిన పనులపై, చేసిన ఖర్చుపై గ్రామసభలో పనుల వారీగా చర్చించారు. అభ్యంతరాలు నమోదు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది తెలిపారు. గురువారం మండలంలోని అన్నారం, జమ్మాపూర్, రాయినిపల్లి గ్రామాల ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కుర్మయ్య పేర్కొన్నారు.